

సాయిచంద్ భార్య వేద రజినిని ఓదార్చుతున్న సీఎం కేసీఆర్.. చిత్రంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, గ్యాదరి కిశోర్

# సాయిచంద్‌కు నివాళి

తెలంగాణ ఉద్యమ గాయకుడు సాయిచంద్ దశదిన కర్మ కార్యక్రమాన్ని హైదరాబాద్ హస్తినాపురంలోని జీఎస్‌ఆర్ కన్వెన్షన్ హాలులో ఆదివారం నిర్వహించారు. సీఎం కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, కళాకారులు పాల్గొని సాయిచంద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సాయిచంద్ కుటుంబ సభ్యులను ఓదార్చారు.

– ఎల్బీనగర్/హయత్‌నగర్



నివాళులర్పిస్తున్న సాయిచంద్ భార్య రజిని, కుటుంబ సభ్యులు





పాటలతో నివాళులర్పిస్తున్న కళాకారులు



హాజరైన బంధువులు, ఆత్మీయులు



మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మంత్రులు జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, తదితరులు



జోహార్.. సాయిచంద్



ఎంపీ రాములు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న



ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జయసింహ, రాకేశ్ కుమార్ తదితరులు

# కుమ్రం భీం గొప్ప పోరాట యోధుడు

- ఆదివాసుల కోసం అనేక సంక్షేమ పథకాలు
- తండాలను జీపీలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే
- మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు
- లక్షెట్టిపేటలో విగ్రహావిష్కరణ

లక్షెట్టిపేట రూరల్, జూలై 9 : జల్, జంగల్, జమీన్ నినాదంతో అడవి బిడ్డల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన కుమ్రం భీం గొప్ప యోధుడు అని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కొనియాడారు. పట్టణంలోని కరీంనగర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కుమ్రం భీం విగ్రహాన్ని ఆదివారం స్థానిక నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆదివాసులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. గిరిజనుల అభ్యున్నతి కోసం బీఆర్‌ఎస్ సర్కారు ఎనలేని కృషిచేస్తున్నదని తెలిపారు. వారి సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశ పెడుతున్నట్లు చెప్పారు. 'మా తండాలో మా రాజ్యం' అన్న భీం నినాదాన్ని తెలంగాణ ప్రభుత్వం నిజంచేసిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తండాలను పంచాయతీలుగా చేసి, గిరిజనులకు పాలనాధికారాన్ని అందించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్, పార్టీ పట్టణాధ్యక్షుడు పాదం శ్రీనివాస్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఆదివాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముక్రా(కే)లో స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే

ఇచ్చోడ, జూలై 9 : ముక్రా(కే) గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణంలో భాగంగా పంచాయతీ కార్యదర్శి పురుషోత్తం, సర్పంచ్ మీనాక్షి సర్వే నిర్వహించారు. ఆదివారం ఇంటింటికీ తిరిగి ట్రాక్టర్ ట్రాలీ ద్వారా తడి, పొడి చెత్త వేర్వేరుగా జరుగుతుందా, మరుగుదొడ్లు ఉన్నాయా లేవా అని, సంక్షేమ పథకాల వివరాలు సేకరించారు. ప్రతి ఇంటికి వెళ్లి స్వచ్ఛ గ్రామీణంలో ఈ కార్యక్రమం నిర్వహించామని ఎంపీటీసీ సుభాష్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్

# ఆశయం కోసం ఆరాటం

- ఎవరెస్ట్ అధిరోహించాలనే లక్ష్యం
- ప్రతిభ ఉన్నా అడ్డువచ్చిన పేదరికం
- ఆర్థిక సాయం కోరుతున్న ప్రతిభావంతుడు గిత్తె కార్తీక్

**దాతలు 7286806814**
**గూగుల్ పే, ఫోన్ పే**
**చేయాలని వేడుకోలు**

*తన ఆశయం కోసం చిన్ననాటి నుంచి ఆరాటపడుతున్నాడు ఈ యువకుడు. ఎవరెస్ట్ అధిరోహించాలనే కోరిక.. అందుకు తగ్గ ప్రతిభ ఉన్నా.. అడుగడుగునా పేదరికం అడ్డుపడడంతో ముందుకుసాగలేకపోతున్నాడు. ఇప్పటికే వివిధ విభాగాల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పతకాలు సాధించి.. తన లక్ష్యం కోసం శక్తికి మించి కృషిచేస్తున్నాడు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండల కేంద్రానికి చెందిన గిత్తె కార్తీక్. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఉన్నా.. ఆర్థిక పరిస్థితి బాగోలేదని, దాతలు ఆదుకోవాలని కోరుతున్నాడు ఈ ప్రతిభావంతుడు..* – ఆసిఫాబాద్, జూలై 9



జాతీయస్థాయిలో బంగారు పతకం సాధించిన కార్తీక్‌ను అభినందిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్ ( ఫైల్ )

కెరమెరి మండల కేంద్రానికి చెందిన గిత్తె రుక్మాజీ–ఇట్టాబాయి కొడుకు గిత్తె కార్తీక్.. ఆసిఫాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో పదోతరగతి వరకు చదువుకున్నాడు. ప్రస్తుతం చెన్నూర్ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఇప్పటికే నేపాల్‌లో 2022 డిసెంబర్ 30, 31వ తేదీల్లో జరిగిన ఇంటర్నేషనల్ చెస్ పోటీల్లో బంగారు పతకం సాధించి వారేవ్వా అనిపించుకున్నాడు. అలాగే సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు ఆదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడలో జరిగిన జాతీయ స్థాయి వాటర్ ఫాల్ రాఫెల్లింగ్‌లోనూ బంగారు పతకం సాధించాడు. భారత జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పెయింటింగ్ కాంపిటేషన్‌లోనూ ప్రథమస్థానంలో నిలిచాడు. జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన సమయంలో జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి.. అప్పటి కలెక్టర్ రాహుల్ రాజ్‌తో మాట్లాడి ప్రభుత్వపరంగా ఆర్థికంగా చేయూతనందించారు. దీంతో బంగారు పతకం సాధించేందుకు దోహదపడ్డారు. ఈ యువకుడి చిన్ననాటి కోరిక ఎవరెస్ట్ అధిరోహించడం. ఇప్పటికే పలు సాధనలు చేసి, ఎవరెస్ట్ అధిరోహణకు అర్హత సాధించాడు. ఆశయం ఉన్నప్పటికీ ఆర్థిక స్తోమత అడ్డురావడంతో అయోమయంలో పడ్డాడు. ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉన్నప్పటికీ కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేక ఇబ్బందులు పడుతున్నట్లు కార్తీక్ తెలిపాడు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సహకరించడంతో తన ప్రతిభకు పదునుపెట్టి పథకాలు సాధించేందుకు కృషిచేస్తున్నానని పేర్కొన్నాడు. కాగా, ఎవరెస్ట్ అధిరోహించేందుకు సుమారు రూ.40 వేల వరకు ఖర్చు అవుతుందని, దాతలు పెద్ద మనసుతో ఆదుకోవాలని కోరుతున్నాడు. దాతలు 7286806814 నంబర్‌కు గూగుల్ పే, ఫోన్ పే ద్వారా సాయం చేసి ఆదుకోవాలని వేడుకుటున్నాడు.